

డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: డెల్టా కాలువలకు బుధవారం 8,970 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1720,పశ్చిమ డెల్టాకు 4600 క్యూసెక్కులు విడుదల చేశారు.



ఆరుదెంచిన నవోదయం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేశారు. 8లో▶

ప్యారీ సుగర్ ఔదార్యం



కాకినాడ సిటీ: కాకినాడలోని ఆనంద నిలయం వసతి గృహ భవన ఆధునీకీకరణకు సీఎస్ఆర్ కింద ప్యారీ సుగర్ రిఫైనరీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.10 లక్షల సహాయన్ని సంస్థ ప్రతినిధులు బుధవారం కలెక్టర్ కృతికా శుక్లాకు అందజేశారు.

న్యూస్‌రీల్

ర్యాలి ఆలయ అన్నదాన పథకానికి విరాళాలు



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో కృష్ణచైతన్య

ఆత్రేయపురం: ర్యాలి శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ నిత్య అన్నదాన పథకానికి రెండు విరాళాలు అందినట్టు ఈవో బి.కృష్ణ చైతన్య తెలిపారు. ఏలూరుకు చెందిన మిరియాల నాగ కల్యాణ్, హారిక రూ.32 వేలు, మిరియాల దత్త సాయినాథ్, సత్య శ్రావణి రూ.11,116 విరాళం సమర్పించినట్టు తెలిపారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందించారు.

బాలాజీకి వెండి మకర తోరణం సమర్పణ



అప్పనపల్లి బాలాజీ స్వామికి వెండి మకర తోరణం సమర్పించిన దాతలు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి సన్నిధిలో నిర్వహించే నిత్య కల్యాణానికి కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన మెర్ల వెంకన్నచౌదరి, మనికుమారి దంపతులు బుధవారం వెండి మకర తోరణం సమర్పించారు. 3 కిలోల 300 మిల్లీ గ్రాముల వెండితో ఈ మకర తోరణం చేయించారు. దీని విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎంకేటీ నాగవరప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. రాజోలు మండలం తాటిపాకకు చెందిన బొల్లంపల్లి శ్రీరాములు, వెంకట లక్ష్మీరత్నం దంపతులు మకర తోరణానికి రూ.20 వేలు విరాళం అందించారు. దాతలకు స్వామి వారి చిత్రపటాలతో పాటు ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

6 నుంచి యానాం పీపుల్స్ కల్చరల్ ఫెస్టివల్

యానాం: పుదుచ్చేరి పర్యాటకశాఖ ఆధ్వర్యంలో 19వ యానాం పీపుల్స్ కల్చరల్ ఫెస్టివల్‌ను ఈ నెల 6,7,8 తేదీల్లో నిర్వహించనున్నట్లు రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల పాటు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అధ్యక్షతన జరిగే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు సాయంత్రం జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. గెస్ట్ ఆఫ్ హానర్‌గా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, మత్స్యశాఖ కార్యదర్శి నెడుంజెళియన్, టూరిజమ్ డైరెక్టర్ పి.ప్రియదర్శిని హాజరవుతారన్నారు. ముగింపు వేడుకలకు సీఎం రంగసామి, హాజరవుతారన్నారు. నృత్యాలు, ఆర్కెస్ట్రా, జబర్దస్ టీమ్‌తో కామెడీ షో, మిమిక్రీ షో నిర్వహిస్తారన్నారు.

శీతల నిల్వతో తాజాధనం

- ఉద్యాన రైతులకు మేలు చేసేలా కోల్డ్ స్టోరేజ్‌లు
- జిల్లాలో తొలి విడతగా ఆరు కేటాయింపు
- యూనిట్ విలువ రూ.15 లక్షలు
- రాయితీ రూ.11.25 లక్షలు



కోల్డ్ స్టోరేజ్‌లో పండ్లు

సాక్షి అమలాపురం: టమాట ధర ఒకసారి ఆకాశాన్నంటుతోంది. మరోసారి నేల చూపు చూస్తోంది. ఆకాశాన్ని అంటే సమయంలో రైతులకు కాసులే కాసులు. అదే నేలనంటితే మాత్రం పండిన పంటను పెంట కుప్పల మీద, కార్పొరేషన్ డంపింగ్ యార్డుల్లో వేయాల్సిందే. కొన్నిసార్లు పంటను పశువులకు మేతగా వదిలేయాల్సిందే. ఒక్క టామటానే కాదు.. కూరగాయల పరిస్థితి అంతా ఇంతే. ఇటువంటి గడ్డు స్థితిలో కనీసం పది, పదిహేను రోజులు పంటను నిల్వ చేసుకోగలిగితే మంచి ధర వచ్చే అవకాశముంది. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కోల్డ్ స్టోరేజ్‌ల (శీతల నిల్వ కేంద్రాల)ను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. వీటిలో పండ్లు, కూరగాయలు, పాలు వంటి రైతు ఉత్పత్తులను ఎక్కువ కాలం నిల్వ ఉంచి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే వెసులుబాటు కల్పించనుంది.

ఏఐఎఫ్‌తో నిర్మాణం

జిల్లాలో ఉద్యాన పంటలు 1,45,451.55 ఎకరాల్లో సాగవుతున్నాయి. కొబ్బరి నిల్వ చేసేందుకు ప్యాక్ హౌస్‌లు ఉన్నాయి. కాని కూరగాయలు, ఇతర పండ్లను నిల్వ చేసే సౌకర్యం లేకుండా పోయింది. దీని వల్ల ఉద్యాన రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్)తో కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణానికి ముందుకు వచ్చింది.

మూడు స్థాయిల్లో నిల్వ సామర్థ్యం

నెలకు 10 టన్నులు, 20 టన్నులు, 30 టన్నుల నిల్వ సామర్థ్యంతో కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం జరగనుంది. రెండు నుంచి 25 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతల్లో ఉంచవచ్చు. **అరటి నెలలు తరబడి నిల్వ చేయవచ్చు, యాపిల్ నాలుగు నెలలు, మామిడి 15 రోజులు, డ్రాగన్ నెల, బంగాళదుంప, క్యారెట్, బీట్‌రూట్ వంటివి రెండు నెలలు, టమాటా 10 రోజులు, పువ్వులు వారం పది రోజులు నిల్వ చేసుకునే అవకాశముంది. తాజాదనం తగ్గకుండా** ఉంటుంది. యూనిట్ ఖర్చు రూ.15 లక్షలు. దీనిలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో) వాటా రూ.3.75 లక్షలు (25 శాతం) కాగా, ప్రభుత్వం ఏఐఎఫ్ నుంచి రూ.11.25 లక్షలు (75 శాతం) అందించనుంది. జిల్లాలో తొలి విడతగా ఆరు కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. మొత్తం వీటి విలువ రూ.90 లక్షలు కాగా, దీనిలో రూ.67.50 లక్షలు రాయితీగా అందిస్తోంది.

కోల్డ్‌స్టోరేజ్‌తో మెరుగైన ఫలితాలు

కూరగాయలు, పండ్లు నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులు పంట కోసిన ఒకటి రెండు రోజుల్లోనే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో 5,345 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతుండగా, 23,472 ఎకరాల్లో అరటి, తీపి నారింజ, బత్తాయి, బొప్పాయి, మామిడి పంటల సాగు జరుగుతోంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కూరగాయలు, పాలు, ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పండ్లను స్థానికంగా అమ్మకాలు చేయడం ఆరంభిస్తే కోల్డ్‌స్టోరేజ్ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముంది. మామిడి, అరటి వంటి వాటిని రైపినింగ్ చాంబర్ ద్వారా సహజ సిద్ధంగా పక్వానికి తీసుకురావచ్చు.

బ్లూస్టార్‌తో ఎంవోయూ

కోల్డ్ స్టోరేజ్‌ల ద్వారా 15 రోజుల వరకు నిల్వ చేసుకునే అవకాశం వస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. కోల్డ్ స్టోరేజ్ నిర్మాణ విషయంలో ఉద్యానశాఖతోపాటు బ్లూస్టార్ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ సంస్థతో ప్రభుత్వం ఎంవోయూ చేసుకుంది. ఎఫ్‌పీవో తన వాటా సొమ్ము చెల్లిస్తే బ్లూస్టార్ సంస్థ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం చేపడుతుంది. ప్రభుత్వం నుంచి అందే రాయితీ, బ్యాంకు రుణం వంటి విషయాలు ఆ సంస్థ చూసుకుంటుంది.

పండ్లు.. కూరగాయల రైతులకు మేలు



జిల్లాలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో కూరగాయ, పండ్ల తోటల పెంపక విస్తీర్ణం ఏటా పెరుగుతోంది. వీటిని నిల్వ చేసే సౌకర్యాలు రైతుల వద్ద చాలా తక్కువగా ఉన్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే జిల్లాలో 1.80 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఏర్పడుతుంది. ఈ కారణంగా తొలి దశలో ఆరు కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మూడు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ముందుకు వచ్చాయి.

– ఎస్.మల్లికార్జునరావు, ఉద్యానశాఖ జిల్లా అధికారి



కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసిన కూరగాయలు



కోల్డ్ స్టోరేజ్ లోపలిభాగం (నమూనా)

ఫిబ్రవరి 17 నాటికి బైపాస్ రోడ్డు

అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం



అమలాపురం బైపాస్ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: పేరూరు – భట్నవిల్లి రోడ్డు పనులు వేగవంతం చేసి ఫిబ్రవరి 17 నాటికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ రహదారి నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో ఈ బ్రిడ్జి, రహదారి నిర్మాణ పనులను పరిశీలించి సంక్రాంతికి పూర్తి చేయాలని సూచించానని చెప్పారు. అయితే ఆ దిశగా పనులు జరగని కారణంగా ఫిబ్రవరి 17 నాటికి గడువు విధించినట్టు చెప్పారు. కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ దగ్గర ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సంక్రాంతి నాటికి ఎర్ర వంతెన– ఢిల్లీ పబ్లిక్ స్కూల్ మీదుగా పేరూరుకు బైపాస్‌రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించాలని ఆదేశించారు. నిర్మాణ పనులలో సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తెచ్చి పరిష్కార మార్గాలు కోరాలని సూచించారు. మోర్త ప్రాజెక్ట్ డైరెక్టర్ సాయి శ్రీనివాస్, టాటా ప్రాజెక్ట్ ఏజీఎం శ్రీకాంత్, తహసీల్దార్‌పరమట శ్రీ పల్లవి పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన రుగ్వేద మహాసభలు



ముంగండలో వేద పారాయణ చేస్తున్న రుగ్వేద పండితులు

పి.గన్నవరం: ముంగండ చింతామణి గణపతి మందిరంలో శ్రీఆశ్వలాయన మహర్షి రుగ్వేద పరిషత్ ఆధ్వర్యంలో సంపూర్ణ రుగ్వేద సంహిత పారాయణ, వేద విద్వత్ మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఉమా మూలేశ్వరస్వామివారి ఆలయం నుంచి సభాస్థలి వరకూ గ్రామ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, స్వస్తి వాచనం, అఖండ స్థాపన, పుణ్యాహవాచనము, పంచగవ్య ప్రాశన, వేద పురుష కలశ స్థాపనతో వేద పారాయణ సభలు మొదలయ్యాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రుగ్వేద పండితులు పాల్గొని వేద పఠనం చేశారు. మూడురోజుల పాటు వేదసభలు జరుగుతాయి. కార్యక్రమాలకు రుగ్వేద పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు గోదావరి వెంకట సుబ్బారావు, చెరుకూరి వెంకట సుబ్రహ్మణ్య ప్రసాద్, సహ కార్యదర్శి గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యం వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, వేద రక్షకులు పాల్గొని పూజలు చేశారు.

పింఛన్లపై ప్రతిపక్షాలది దుష్ప్రచారం

మంత్రి విశ్వరూప్



అమలాపురంలో లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న మంత్రి విశ్వరూప్



పెంచిన పింఛను లబ్ధిదారుకు అందజేస్తున్న మంత్రి వేణు

అమలాపురం రూరల్: పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన బుధవారం జరిగిన పింఛన్ల పెంపు వారోత్సవాల సభను మంత్రి విశ్వరూప్ ప్రారంభించి ప్రసంగించారు. తొలుత అమలాపురం పట్టణం, రూరల్ మండల పరిధిలో కొత్తగా మంజూరైన 511 మంది పెన్షన్ లబ్ధిదారులతో కలిసి మంత్రి విశ్వరూప్ కేక్ కట్ చేశారు. అనంతరం వారికి పెంచిన రూ.2,750 వంతున దాదాపు రూ.14 లక్షల మేర పెన్షన్ల సొమ్మును పంపిణీ చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ.75 పింఛన్ ఇచ్చేవారు. ఓ పింఛన్‌దారుడు చనిపోతే ఆ స్థానంలో కొత్తగా పింఛన్ ఇచ్చే దుస్థితి ఉండేదని చెప్పారు. ఈ కష్టాలను కళ్లారా చూసిన మహానేత దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పింఛన్‌ను రూ.200కు పెంచారని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పింఛన్లను పెంచుకుంటూ వస్తున్నారని తెలిపారు. కొత్తగా పెన్షన్లు పొందిన లబ్ధిదారులు కృతజ్ఞతగా మంత్రి విశ్వరూప్‌ను సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, డీసీసీబీ డైరెక్టర్ ఇళ్ల గోపాలకృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పొలమూరి బాలకృష్ణ, అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాట తప్పని సీఎం జగన్ : మంత్రి వేణు

రామచంద్రపురం: ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఒక వృద్ధురాలికి పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుకుంటూ వెళతానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాన్ని చేసి చూపిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో సుమారు 5 వేల మంది లబ్ధిదారులతో నిర్వహించిన పింఛన్ పెంపు వారోత్సవాల కార్యక్రమంలో మంత్రి వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఈ ఏడాది ప్రారంభం నుంచే రూ. 2,750కు పెంచిన పింఛన్ అందిస్తున్నారని అన్నారు. సంక్షేమ పాలన అంటే ప్రతి ఒక్కరూ మన రాష్ట్రం వైపు చూసేలా ఉందన్నారు. 1999 నుంచి 2004 వరకు రామచంద్రపురం పట్టణం, రూరల్‌లో కలిపి 4,854 మంది లబ్ధిదారులు ఉండగా ప్రస్తుతం రూరల్‌లో 10,459 మంది, పట్టణంలో 4,522 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. పెంచిన పింఛన్‌ను మంత్రి వేణు లబ్ధిదారులకు అందజేశారు. సభలో లబ్ధిదారులు ప్ల కార్డులతో జైజగన్ అంటూ నినాదాలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పి.గోవిందరాజు, జెడ్పీటీసీ సభ్యుడు ఎం.వెంకటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు టి.ప్రసన్నవిజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.శ్రీదేవి, వైస్ చైర్మన్లు సీహెచ్ నాగేశ్వరరావు, కె. శివాజీ, ఎంపీపీ ఎ.భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ పాల్గొన్నారు.

ప్రయాణంలో అభయం

- ఆటోలు, క్యాబ్‌లలో మహిళలకు భద్రత
- ప్రయాణ వివరాలు గుర్తించే వ్యవస్థ
- నెలాఖరుకు వాహనాల్లో జీపీఎస్ డివైజ్
- మహిళా ప్రయాణికులకు మరో వరం



పాసింజర్ ఆటోకు అమర్చిన అభయం పరికరం



అభయం యాప్

సాక్షిప్రతినిధి, కాకినాడ: మహిళలకు అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యం కల్పించాలనేది ప్రభుత్వ సంకల్పం. ఇప్పటికే అన్ని రకాల నామినేటెడ్ పోస్టుల్లో సగం మహిళలతో భర్తీ చేసింది. పదవులతో పాటు మనో ధైర్యాన్ని నింపి భద్రత కల్పించాలని భావిస్తోంది. ఇందుకు నడుం బిగించిన ప్రభుత్వం 'మీ భద్రత–మా బాధ్యత' నినాదంతో 'అభయం' పేరుతో ఓ బృహత్తర కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇటీవల ఆటోలు, క్యాబ్‌లలో ప్రయాణించే మహిళలకు పలు సందర్భాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు అక్కడక్కడా వెలుగు చూస్తున్నాయి. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. గతేడాది నవంబరులోనే శ్రీకారం చుట్టాలని భావించి ప్రయోగాత్మకంగా కాకినాడ జిల్లాలో మొదలు పెట్టారు. సాంకేతిక కారణాలతో ఆ ప్రక్రియ వేగం అందుకోలేదు. ఈ కొత్త సంవత్సరంలో పటిష్టంగా 'అభయం' అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఎలా పనిచేస్తుందంటే..

- మహిళల భద్రతకు ప్రభుత్వం మరెక్కడా లేని విధంగా దిశ యాప్ ప్రవేశపెట్టింది. దిశ చట్టంపై కూడా కేంద్రానికి ప్రతిపాదించింది. దిశ చట్టం కాకున్నా దిశ యాప్, దిశ పోలీసు స్టేషన్ల ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వం మహిళలకు మనో ధైర్యాన్ని ఇవ్వగలుగుతోంది.
- రాత్రిపూట మహిళలను ఇంటికి చేర్చేందుకు 'ఉమెన్ డ్రాప్ ఎట్ హోం' అనే కార్యక్రమాన్ని కూడా చేపట్టింది.
- ఇందుకు కొనసాగింపుగా ఆటోలు, క్యాబ్‌లలో మహిళా ప్రయాణికులకు రక్షణకు 'అభయం' అమలు చేసేందుకు సిద్ధమవుతోంది.
- ఒంటరి మహిళ అయినా మరెవరైనా ఏ సమయంలోనైనా ప్రయాణించేలా దీనిని రూపుదిద్దుతున్నారు.
- ఆటో, క్యాబ్‌లలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రాకింగ్ డివైజ్‌లు ఏర్పాటు చేయనున్నారు.
- ఈ డివైజ్‌లను ఆటోలు, క్యాబ్‌లలో అమర్చుతారు. తద్వారా డ్రైవర్ వివరాలతో పాటు, వాహనం ఏ ప్రాంతం నుంచి ఏ ప్రాంతానికి వెళుతోంది, ప్రయాణంలో ఉన్న ఆటోలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా లాంటి అంశాలను కమాండ్ కంట్రోల్‌కు వివరాలు చేరతాయి.
- అలా వచ్చిన సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేస్తారు. వారు స్పందించి వెంటనే సంఘటన స్థలానికి క్షణాల్లోనే చేరుకుని అండగా నిలుస్తారు.
- ఆటో యూనియన్ ప్రతినిధులతో సమావేశమై వారికి అవగాహన కల్పించి డివైజ్‌లను అమర్చనున్నారు.

డివైజ్‌లు రావడమే తరువాయి



అభయం విధానాన్ని గతేడాది అమలులోకి తీసుకురావాలని భావించాం. కాకినాడలో ప్రయోగాత్మకంగా కొన్ని ఆటోలకు ట్రాకింగ్ డివైజ్ బిగించాం. వివిధ సాంకేతిక కారణాలతో కొంత **జాప్యం జరిగింది.** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారుగా 33వేల ఆటోలు, 1,750 క్యాబ్‌లు ఉన్నాయని అంచనా వేస్తున్నాం. కాకినాడ జిల్లాలో ప్రయోగాత్మకంగా 300 వాహనాలకు డివైజ్ బిగించాం. మూడు జిల్లాల్లోనూ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం. డివైజ్‌లు రావడమే తరువాయి.

– ఎ.మోహన్, జిల్లా రవాణాశాఖాధికారి, కాకినాడ.

ఇలా రక్షణ కల్పిస్తుంది..

ఆటో లేదా క్యాబ్‌లో పరికరం అమర్చుతారు. వాహనాన్ని స్టార్ట్ చేసే సమయంలో డ్రైవర్ తన స్మార్ట్ డ్రైవింగ్ లైసెన్స్‌ను డివైజ్ వద్ద ట్రిప్ చేయాల్సి ఉంటుంది. ట్రిప్ చేసిన వెంటనే డ్రైవర్ వివరాలు పరికరంలోకి నిక్షిప్తమౌతాయి. స్మార్ట్ ఫోన్ కలిగిన మహిళ ప్లేస్టోర్‌లో అభయం మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ అవ్వాలి. ప్రయాణానికి ముందు వాహనంపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసినా, వాహనం నంబర్ నమోదు చేసినా డ్రైవర్ వివరాలు ఇట్టే తెలిసిపోతాయి. యాప్ స్కాన్ చేసి వివరాలు నిర్ధారించుకున్నాక గమ్యస్థానం నమోదు చేయాలి. ట్రిప్ వివరాలు, లోకేషన్‌ను సంరక్షకునితో షేర్ చేయాలి. అందులో ప్రయాణికులకు మూడు రూట్లు కనిపిస్తాయి. ఆ రూట్లు జియోట్యాగింగ్ మాదిరిగానే జియోఫెన్స్‌కు అనుసంధానంగా ఉంటాయి. వాహనం దారి మళ్లించినా లేదా, డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించినా వెంటనే పరికరంలో పానిక్ అనే బటన్ నొక్కాలి. అలా చేయగానే కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అలర్ట్ వెళ్తుంది. సమీప పోలీసులు జీపీఎస్ లోకేషన్ ట్రాకింగ్ ద్వారా వెంటనే వాహనాన్ని గుర్తించి రక్షణ కల్పిస్తారు.

సమన్వయంతో అంతర్వేది ఉత్సవాలు



ఉత్సవాల నిర్వహణపై చర్చిస్తున్న ఆర్డీవో వసంతరాయుడు, డీఎస్పీలు మాధవరెడ్డి, రమణ తదితరులు

అమలాపురం టౌన్: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఉత్సవాలను అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతం చేద్దామని అమలాపురం ఆర్డీవో ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు అన్నారు. అంతర్వేది ఉత్సవాల నిర్వహణకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల డివిజన్ అధికారులతో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల కోసం బందోబస్తుపై అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు వై.మాధవరెడ్డి, రమణలతో చర్చించారు. ఆర్టీసీ బస్సు సర్వీసుల నిర్వహణ, భక్తులకు తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై మాట్లాడారు. ఈ నెల 28 నుంచి జరిగే స్వామి ఉత్సవాలకు ప్రభుత్వ శాఖల వారీగా చేపట్టాల్సిన విధులపై సమావేశం సమీక్షించారు. రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. స్వామి కల్యాణం మర్నాడు జరిగే రథోత్సవానికి లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు కల్పించే సౌకర్యాలపై చర్చించారు.

152 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కాకినాడ క్రైం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన 152 పోస్టుల భర్తీకి డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతిప్రభ బుధవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 5 నుంచి 12వ తేదీ మధ్య సెలవు దినాలు కాగా మిగిలిన అన్ని రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు పొందడం కోసం, విద్యార్హతలు, ఇతర వివరాల కోసం ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీవోవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లను సందర్శించాలన్నారు.

క్లుప్తంగా

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఏడాది జైలు, రూ.ఎనిమిది లక్షల పరిహారం విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సి.జానకి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన మల్లేశ్వరపు సాంబమూర్తి వద్ద నుంచి కాకినాడకు చెందిన నమ్మగంటి నకులుడు 2018లో రూ.8 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2019లో రూ.8 లక్షలకు చెక్కు ఇచ్చాడు. చెక్కును సాంబమూర్తి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.8 లక్షల పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.

గొల్లప్రోలులో చోరీ

పిఠాపురం: గొల్లప్రోలు ఈబీసీ కాలనీలో బి.బాబూరావు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగినట్లు గొల్లప్రోలు ఎస్ఐ వినయ్ ప్రతాప్ బుధవారం తెలిపారు. ఇంట్లో వారందరు ఇటీవల తిరుపతి వెళ్లి బుధవారం వచ్చి చూడగా ఇంటి వెనక తలుపులు తీసి ఉంది. లోపల బీరువాలో కొంత నగదు, ఇంట్లో ఉన్న లాప్‌టాప్ చోరీ అయినట్లు ఆయన తెలిపారు. అదే బీరువాలో విలువైన బంగారు నగలు భద్రంగానే ఉండడంతో ఎవరో తెలిసిన ఇంటి దొంగ పనే అయి ఉంటుందని పోలీసులు బావిస్తున్నారు.


ఆరుదెంచిన నవోదయం

- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బాసటగా జవహర్ నవోదయ
- 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 31 వరకు గడువు
- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష

రాయవరం: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు 1986లో జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేశారు. ఉత్తమ విలువలతో బోధన..విద్యా ప్రమాణాల మెరుగు.. క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు సమైక్యతా భావం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్దాపురం, ఎటపాకల్లో జవహర్ నవోదయ విద్యాలయాలున్నాయి. ఈ విద్యాలయాల్లో 80 చొప్పున ఉన్న సీట్ల కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నారు.

ఒక్కసారే అవకాశం..

జవహర్ నవోదయ పాఠశాలల్లో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయా మండలాల్లోని ఐదవ తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బాలబాలికలు 2011 మే ఒకటవ తేదీ నుంచి 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వం గుర్తించిన పాఠశాలల్లో 3,4 తరగతులు ఉత్తీర్ణత సాధించి ఐదవ తరగతి చదువుతున్నవారు మాత్రమే అర్హులు. గతేడాది ప్రవేశ పరీక్షకు హాజరైన వారు అనర్హులు.



జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్ష బుక్‌లెట్

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం..

నవోదయలో ప్రవేశానికి రిజర్వేషన్ విధానం అమలవుతోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయిస్తారు. షెడ్యూల్ కులాలకు 15 శాతం, షెడ్యూల్ తరగతులకు ఏడు శాతం, దివ్యాంగులకు మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రవేశాల్లో బాలికలకు 33 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారు. విద్యార్థులు కష్టపడి చదివితే తప్పనిసరిగా సీటు వచ్చే అవకాశం ఉంది.

విద్యాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు..

అన్ని మండల విద్యాశాఖాధికారుల వద్ద, ఏపీ సమగ్ర శిక్షా, జిల్లా విద్యాశాఖ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దరఖాస్తులు లభ్యమవుతాయి. నవోదయ వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తులు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ లోగా సంబంధిత మండల విద్యాశాఖాధికారులకు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయవచ్చు.

పరీక్షా విధానమిదీ..

నవోదయ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 29న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య నిర్దేశించిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షను విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న భాషను(తెలుగు/ఇంగ్లిషు) ఎంచుకొని పరీక్ష రాసే వీలుంది. ప్రవేశ పరీక్షలో 100 ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు మూడు విభాగాల్లో ప్రశ్నలు కేటాయిస్తారు. మేధాశక్తిపై 50 ప్రశ్నలు, గణితం, తెలుగు భాషపై ఒక్కొక్క విభాగానికి 25 ప్రశ్నలు వంతున 50 ప్రశ్నలు ఉంటాయి. పరీక్షా పత్రాల రూపకల్పన నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) నిర్వహిస్తుంది. ఎంపికైన వారికి మొదటి రెండు సంవత్సరాలు తెలుగు/ఇంగ్లిషు భాషల్లో బోధిస్తారు. అనంతరం ఇంగ్లిషులోనే బోధన చేస్తారు.

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం..

నవోదయ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కల్పించేందుకు కృషి చేస్తారు. క్రీడలు, యోగా ద్వారా వ్యక్తిత్వ వికాసం ఉంటుంది. వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు విద్యార్థులకు ఉచితంగా అందజేస్తారు. బాలబాలికలకు ప్రత్యేక వసతి గృహాలు ఉంటాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుంది. తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు నామమాత్రపు ఫీజు నెలకు రూ.200 ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, వికలాంగ విద్యార్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

– ఎమ్‌వీ రవిసాగర్, డీఈవో, కోనసీమ

గంజాయి ముఠా అరెస్టు

- 22 కిలోల సరకు స్వాధీనం


పోలీసులు అదుపులోకి తీసుకున్న గంజాయి ముఠా

మండపేట: గంజాయి అమ్మకాలు చేసే ముఠాను పట్టణ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.44 వేలు విలువ చేసే 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంజాయి అమ్మకాలు చేస్తున్న ముఠా పట్టణంలో తిరుగుతున్నట్టు జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి అందిన సమాచారంతో సీఐ పి. శివగణేష్, ఎస్.అశోక్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. స్థానిక బైపాస్ రోడ్డులోని టోల్‌గేట్ వద్ద గంజాయి పంచుకుంటున్న అనపర్తికి చెందిన కొవ్వూరి సతీష్‌రెడ్డి, జాగవరపు జగదీష్, దుప్పలపూడికి చెందిన కర్రి అజయ్‌గోపాలకృష్ణ, పసలపూడికి చెందిన ఇద్దరు మైనర్లను అరెస్టు చేశారు. వారి నుంచి గంజాయి, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తహసీల్దార్ టి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

గడ్డిని తరలిస్తుండగా ప్రమాదం

కాకినాడ క్రైం: పాడి అవసరాల కోసం గడ్డిని తరలిస్తుండగా విద్యుత్ తీగ తగిలి ఓ ట్రాక్టర్‌కి మంటలంటుకున్నాయి. బుధవారం కాకినాడలోని ఎల్విన్‌పేటలో జరిగిన ఈ ఘటనలో ట్రాక్టర్ పాక్షికంగా దెబ్బతింది. సాలిపేట ఫైర్ స్టేషన్ అధికారి ఏసుబాబు ఆధ్వర్యంలోని బృందం అక్కడికి చేరుకొని ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను అదుపు చేసింది. సుమారు రూ.50 వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: మండలంలోని మడుపల్లికి చెందిన ఓ వ్యక్తి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేలపూడి వెంకట్రావు(67) గత డిసెంబర్ నెల 31న ఇంట్లో ఉన్న కలుపు మందును మద్యం అనుకుని తాగాడు. అతని పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవిరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

జనాభిమానంతో సీఎం సభ సక్సెస్

- ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజమహేంద్రవరంలో మంగళవారం పాల్గొన్న బహిరంగ సభ విజయవంతం కావడానికి ప్రజలకు జగన్‌పై ఉన్న అభిమానమే కారణమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. అందుకే సుమారు లక్షకు పైగా ప్రజలు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారన్నారు. బుధవారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో గల ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభను సక్సెస్ చేసిన తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహించినా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. అయితే టీడీపీ అనుకూల ఎల్లో మీడియా లేని దుష్ప్రచారం చేస్తోందన్నారు. జనాన్ని తరలించి, బయటకు రాకుండా నిర్బంధించినట్టు ప్రసారం చేయడాన్ని ఆయన ఖండించారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

దేశం మొత్తంపై అవ్వాతాతలకు ఇంత పెద్ద మొత్తంలో పెన్షన్లు అందజేస్తున్న ఘనత ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో వెయ్యి రూపాయల పెన్షన్ ఇవ్వడమే గగనమయ్యేదన్నారు. జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపైనా, లంచాలపైనా లబ్ధిదారుల ఎంపిక జరిగేదని చెప్పారు. ఇప్పుడు అర్హత ప్రాతిపదికగా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని అన్నారు. టీడీపీ హయాంలో 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్లు ఇస్తే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 64.06 లక్షల మందికి అందజేస్తోందన్నారు. టీడీపీ హయాంలో నెలకు రూ.400 కోట్లు పెన్షన్లకు కేటాయిస్తే, జగన్ సర్కారు నెలకు రూ.17,565 కోట్లు వెచ్చిస్తోందన్నారు. అందుకే పెన్షన్ల పెంపు వారోత్సవాలు పండగ వాతావరణంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని అన్నారు. ఇది జీర్ణించుకోలేని ప్రతిపక్షం శోకాలు పెడుతోందని, పెన్షన్లు తీసేస్తారని దుష్ప్రచారం చేస్తోందని చెప్పారు. నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాష్ట్ర తెలికులగాండ్ల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిన భవానీప్రియ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరీఫ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు చోడిశెట్టి సత్యవాణి, కానుబోయిన సాగర్, పాలిక శ్రీను, మజ్జి అప్పారావు పాల్గొన్నారు.

బదిలీలపై సర్వత్రా ఉత్కంఠ

- నేడు హైకోర్టు మార్గదర్శకాలు ఇచ్చే అవకాశం

రాయవరం: ఉపాధ్యాయ బదిలీలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బదిలీలు కోరుకునే ఉపాధ్యాయుల్లో పలువురు పలు అంశాలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో బదిలీలకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లైంది. హైకోర్టు ఆదేశాలు వచ్చిన తర్వాతే ప్రభుత్వం తదుపరి చర్యలను తీసుకోనున్న నేపథ్యంలో అసలు బదిలీలు జరుగుతాయా? లేదా? అన్న మీమాంసను ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 7,986 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

పాయింట్ల కోసం..

గతేడాది డిసెంబరు 12న ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేసింది. అదే నెల 14 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ టీచర్లకు 8ఏళ్లు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు క్యాడర్‌లో ఐదేళ్ల గరిష్ట సర్వీసు పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరి బదిలీకి దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చింది. వీరు కాకుండా రీఅప్పోర్షన్‌కు గురైన వారు, మ్యాపింగ్, నాన్ మ్యాపింగ్‌కు గురైన వారు, 2022లో పదోన్నతులు పొందిన వారు కూడా బదిలీ కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే తప్పనిసరి బదిలీకి గురవుతున్న ఉపాధ్యాయుల్లో పలువురు తమకు పాయింట్ల కేటాయింపులో అన్యాయం జరుగుతోందంటూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వీరితోపాటు ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల బదిలీల్లో గరిష్ట సర్వీసు ఐదేళ్ల ఉంచాలని కోరుతూ కొందరు, వివిధ కేటగిరిల్లో బదిలీలు పొందుతున్న వారు తమకు అదనపు పాయింట్లు కేటాయించాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గురువారం తీర్పు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ తీర్పు ఏ విధంగా ఉంటుందోనని, తీర్పు ప్రభావం బదిలీలపై ఎలా ఉంటుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

క్లియర్ వేకెన్సీ జాబితాలు

జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో క్లియర్ వేకెన్సీ జాబితాలను పొందుపర్చారు. లాంగ్ స్టాండింగ్, క్లియర్ వేకన్సీ జాబితాలను, 2021, 2022 అడ్‌హాక్ పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల స్థానాలను కూడా జాబితాలో చూపించారు.

పేపరుమిల్లు ఉద్యోగిపై కొడవలితో దాడి

- మెడపై గాయం.. ఆసుపత్రికి తరలింపు
- దాడికి పాల్పడిన వ్యక్తి మానసిక స్థితిపై అనుమానం

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెం గ్రామ పరిధిలోని పేపరుమిల్లు ఉద్యోగిపై మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తి బుధవారం కొడవలితో దాడికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అనకాపల్లి సమీపంలోని చీడిపల్లికి చెందిన కసిరెడ్డి శివ పేపరుమిల్లులో పనిచేస్తూ, కడియంలో నివాసం ఉంటున్నాడు. మిల్లుకు సంబంధించిన పనిపై కేశవరం వెళ్లి తిరిగి వస్తున్నాడు. రైల్వే గేటు దాటి మిల్లులోకి వెళ్లే ముందు యూరినల్స్ నిమిత్తం తన బండిని స్లో చేశాడు. అదే సమయంలో అక్కడే గడ్డిలో పడుకుని ఉన్న మధ్యప్రదేశ్ సాగర్ భోపాల్‌కు చెందిన రవి ఇహర్వాల్ అనే 27 ఏళ్ల యువకుడు కొడవలితో శివపై దాడి చేశాడు. శివ మెడపై గాయం కావడంతో అతడు బండిని వదిలేసి మిల్లు గేటు వైపు పరుగు తీశాడు. అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు శివకు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. శివ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. దాడిలో గాయపడిన శివ వదిలేసిన మోటారు సైకిల్‌ను తీసుకుని రవి ఇహర్వాల్ చైతన్యనగర్ వైపు బయలుదేరాడు. ఈ లోపు సమాచారం అందుకున్న స్థానికులు అతడిని నిలువరించి దేహశుద్ధి చేశారు. అంతలోనే పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా అతడి మానసిక స్థితి సక్రమంగా లేనట్టుగా భావిస్తున్నారు. పోలీసులు ఎన్నిసార్లు ప్రశ్నించినా సమాధానం చెప్పడం లేదని తెలుస్తోంది. రెండు రోజులుగా రైల్వే గేటు సమీపంలోనే అతడు తిరుగుతున్నట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఈ దాడికి ముందే అక్కడే ఉన్న మరో వ్యక్తి జేబులోనుంచి నగదు, సెల్‌ఫోన్‌ను కూడా లాక్కుని దాడికి ప్రయత్నించాడంటున్నారు. రైలు పట్టాల వెంబడి నడుచుకుంటూ ఇక్కడికి వచ్చినట్లుగా భావిస్తున్నారు. ఘటనలపై కడియం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


స్వామివరప్రసాద్ మృతదేహం

ఉప్పలగుప్తం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధి చల్లపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం చల్లపల్లి గ్రామంలో కుసుమే వారిపేటకు చెందిన కుసుమే స్వామివరప్రసాద్ (32) తన ఇంటి వెనుక భాగంలో ఉన్న ఆక్వా చెరువు గట్లపై కలుపుమొక్కలను కత్తితో నరుకుతున్నాడు. ఆ సమయంలో గట్టుపై నుంచి వెళ్లిన విద్యుత్ తీగపై పని క్రమంలో కత్తి వేటు పడడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా మృతి చెందినట్టు గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై జి.వెంకటేశ్వరరావు తెలిపారు.

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

- ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు


ప్రదర్శనలను తిలకిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే

పిఠాపురం: ఆధునిక పోకడలు పెరుగుతున్న ఈ తరుణంలో సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలని, సంప్రదాయాల హరివిల్లు మన పెద్ద పండగ సంక్రాంతి అని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పిఠాపురం పోలీసు గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన పోలీసు సంప్రదాయ సంక్రాంతి క్రీడోత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు అంటే కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటివని అందుకే సంప్రదాయాలన్ని తిరిగి గుర్తు చేసుకునే విధంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయ సంక్రాంతి క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. సంక్రాంతికి ఒక కొత్త కళ తీసుకువచ్చే విధంగా పోలీసు శాఖ క్రీడోత్సవాలు నిర్వహించడం సరి కొత్త కోణం ఆవిష్కరణగా సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు అభివర్ణించారు. ఏఎస్పీలు శ్రీనివాస్, సత్యనారాయణ, అప్పారావు, సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, జెడ్పీటీసీ సభ్యులు ఉలవకాయల నాగ లోవరాజు, గుబ్బల తులసీకుమార్, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, ఎస్సైలు అబ్దుల్‌నబీ, రామలింగేశ్వరరావు, జగన్మోహన్, వినయ్ ప్రతాప్ పాల్గొన్నారు.

ఇల్లు వదలి వెళ్లిన బాలిక ఐదు గంటల్లో పట్టివేత

- అన్నవరం ఎస్ఐ శోభన్‌కుమార్‌కు డీజీపీ అభినందన

అన్నవరం: తల్లి మందలించిందన్న కోపంతో ఇల్లు వదిలి పోయిన బాలికను ఐదు గంటల వ్యవధిలోనే వెదికి పట్టుకుని ఆ తల్లికి అప్పగించిన అన్నవరం పోలీసులను పలువురు అభినందించారు. స్థానికంగా నివాసం ఉంటున్న ఆ బాలికను సరిగా చదవడం లేదని తల్లి మంగళవారం ఉదయం మందలించింది. దీంతో ఆ బాలిక ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయింది. మంగళవారం సాయంత్రం వరకు అన్నవరం చుట్టుపక్కల గ్రామాలతో బాటు బంధుమిత్రులను కూడా ఆ తల్లి అడిగినా కుమార్తె జాడ తెలియలేదు. సాయంత్రం ఆరు గంటలకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అలర్ట్ అయిన పోలీసులు ఆ బాలిక ఆచూకీ కోసం విచారణ చేశారు. ఆ బాలిక సోషల్ మీడియా యాక్టివ్‌గా ఉంటుందన్న విషయం తెలుసుకుని ఆ బాలిక సోషల్ మీడియా అకౌంట్‌ను పరిశీలించారు. చివరగా ఆ బాలిక ఎవరితో చాట్ చేసిందో తెలుసుకుని వారితో మాట్లాడగా కాకినాడలో ఆ బాలిక ఉన్నట్టు తెలిసింది. దీంతో మంగళవారం అర్ధరాత్రి కాకినాడ వెళ్లి ఆ బాలికను అన్నవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఎస్ఐ శోభన్‌కుమార్ ఆ బాలిక, ఆమె తల్లికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోవడం చాలా ప్రమాదమని ఆ బాలికను మందలించారు. బాలికను కేవలం ఐదు గంటల వ్యవధిలోనే పట్టుకుని తల్లి వద్దకు చేర్చడంపై అన్నవరం ఎస్ఐ శోభన్‌కుమార్‌ను డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, పెద్దాపురం డీఎస్పీ మురళీమోహన్, సీఐ కిషోర్ బాబు అభినందించారు.

సత్రం గదులకు ఆన్‌లైన్ రిజర్వేషన్

- అన్నవరం ఈఓతో ముఖాముఖిలో భక్తుల సూచన

అన్నవరం: దూర ప్రాంతాల నుంచి సత్యదేవుని సన్నిధికి విచ్చేసే భక్తులకు రత్నగిరి సత్రాలలో వసతి గదులను ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేయించుకునే ఏర్పాటు చేయాలని, స్వామివారి గురించి రథం ద్వారా ప్రచారం చేయాలని పలువురు భక్తులు దేవస్థానం ఈఓ సత్యనారాయణమూర్తిని కోరారు. కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో బుధవారం 'భక్తులతో ఈఓ ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తుల సూచనలు...ఈఓ సమాధానాలు

- గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన భక్తుడు వీరమణిసింగ్ మాట్లాడుతూ సత్రాలలో గదులు కూడా ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకునేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనిపై ఈఓ సమాధానమిస్తూ ఈ విషయమై కొత్త సాఫ్ట్‌వేర్‌ను ×నైన్ అండ్ నైన్ । సంస్థ రూపొందిస్తున్నదని చెప్పారు.
- గుంటూరుకు చెందిన సీహెచ్ మల్లికార్జునరావు మాట్లాడుతూ సత్యదీక్ష గురించి రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలని, మాలధారణ, నియమాల గురించి వివరించాలని కోరారు.
- కాకినాడకు చెందిన సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేశఖండనశాలలో తలనీలాల టికెట్ కౌంటర్ వద్దకు వెళ్లాలంటే 20 మెట్లు దిగాల్సి వస్తోందని, ఈ కౌంటర్‌ను పశ్చిమ రాజగోపురం పక్కన ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని సూచించారు. ఆ మేరకు వెంటనే ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఈఓ ఆదేశించారు.
- పెద్దనాపల్లికి నల్లమిల్లి కృష్ణబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో సత్యదేవుని ప్రచార రథంతో సత్యదీక్షల గురించి కూడా ప్రచారం నిర్వహించాలని పేదలకు ఉచితంగా దీక్షా వస్త్రాలు సమకూర్చాలని కోరారు.
- అన్నవరానికి చెందిన ఈర్లు శ్రీనివాస్ మాట్లాడుతూ దేవస్థానంలో పలు చోట్ల రూ.200 టిక్కెట్‌తో అంతరాలయ దర్శనం ఉందని బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.
- అన్నవరానికి చెందిన దాసరి శంకర్ మాట్లాడుతూ పంపా సత్రంలో హాల్స్ నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని గదులుగా మార్చాలని సూచించారు.


ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న ఈఓ సత్యనారాయణమూర్తి, ఏసీ రమేష్ బాబు తదితరులు

- అన్నవరానికి చెందిన పలివెల సతీష్ మాట్లాడుతూ కళాశాల మైదానంలో రైల్వేస్టేషన్ వద్ద డార్మెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు.
- కాకినాడకు చెందిన బొడ్డు వెంకటరమణ మాట్లాడుతూ సత్యదేవుని ఆలయ శిఖరాన్ని స్వర్ణతాపడం చేయించాలని, రైల్వే, జాతీయరహదారి మీద ప్రయాణించే భక్తులకు దర్శనమిచ్చేలా శంఖు చక్రనామాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

చర్యలు తీసుకుంటాం: ఈఓ సత్యనారాయణ మూర్తి

భక్తులతో ముఖాముఖి కార్యక్రమంలో చేసిన సూచనలు, సలహాలపై ఉన్నతాధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఈఓ సత్యనారాయణ మూర్తి తెలిపారు.